

# వెన్నెలదీపాలు

## – డా.యండమూరి వీరేంద్రనాథ్

*(యండమూరి వీరేంద్రనాథ్ గారి రచనాశైలి గురించి పాఠకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చెప్పే అంశం ఏదైనా, మనసుకి హత్తుకునేలా, మనసుల్ని కదిలించేలా అక్షరరూపం ఇవ్వడం యండమూరిగారి ప్రతి రచనలోనూ స్పష్టంగా కన్పిస్తుంది. ఆయన వ్రాసిన 'విజయానికి ఆరో మెట్టు' పుస్తకంలోని చిన్నచిన్న సంఘటనలను ప్రతినెలా మీకందిస్తున్నాము. ప్రతి సంఘటనా ఏదో ఒక నిత్యజీవితసత్యంపై వెలుగులు ప్రసరింప చేస్తుంది. అన్నీ కలిపి వెన్నెలదీపాల్లా మన మనసుల్ని వెలిగిస్తాయి. వీరేంద్రనాథగారి ప్రత్యేక అనుమతితో ఈ చిన్న కథలు కౌముది పాఠకుల కోసం..)*

*(గత సంచిక తరువాయి)*

**మదర్స్‌డే**

ప్రపంచంలో నాగరికత పెరుగుతుఉన్న కొద్దీ మనిషికీ, మనిషికీ మధ్య ప్రేమని ప్రదర్శించుకునే పద్ధతులు మారుతూ ఉన్నాయి. కంప్యూటర్‌లు, వాలంటైన్స్‌డే కార్డులు ఈ విధమైన ఆప్యాయతల్ని కమర్షియలైజ్ చేస్తున్నాయి. నిజమైన ప్రేమ, ఆప్యాయత, దయ, కరుణ గుండెల్లోంచి రావాలి కానీ మిషన్‌లోంచి, కార్డ్‌ల్లోంచి కాదు.

ఒక వాణిజ్యవేత్త 'మదర్స్‌డే' రోజున ఒక పుష్పగుచ్ఛాలమ్మే బొకే షాప్‌కొచ్చాడు. అతని తల్లి దూరంగా అతని తల్లి దూరంగా వేరే ఊళ్ళో ఉంటోంది. ఆవిడ అడ్రెస్ ఇస్తూ, పుష్పగుచ్ఛాన్ని ఆ రోజు అక్కడికి పంపించమని ఆర్డర్ ఇచ్చి మెట్లు దిగుతూండగా ఒక చిన్నపాప కళ్ళనీళ్ళతో షాప్ ముందు నిలబడి ఉండడం చూసి ఏమైందని అడిగాడు.

'మదర్స్‌డే'నాడు తన తల్లి కోసం ఓ గులాబీ పువ్వు కొనడానికి వస్తే, షాపువాడు ఆ పువ్వుని రూపాయి చెబుతున్నాడని, తన దగ్గర అర్థరూపాయి మాత్రమే ఉందని ఆ అమ్మాయి సజల నయనాలతో చెప్పింది. ఆ వాణిజ్యవేత్త హృదయం ద్రవించింది. పాపకి గులాబి కొనిపెట్టి, తానే స్వయంగా ఇంటి దగ్గర దింపుతానని, కారులో ఎక్కించుకున్నాడు.

పాప డైరక్షన్స్ ఇస్తూవుంటే కారు నడిపాడు. ఒక స్మశానం దగ్గర కారు ఆపమంది పాప. కారు దిగి లోపలికి వెళ్ళింది.

వాణిజ్యవేత్త ఆశ్చర్యంగా చూడసాగాడు. ఆ పాప తల్లి కొద్దిరోజుల క్రితమే మరణించినట్టుంది. అందరానంత సుదూర తీరాలకి వెళ్ళిపోయిన తల్లికోసం పువ్వుకొన్నది.

కొత్తగా తవ్విన సమాధి మీద ఆ పువ్వు పెట్టి "హ్యాపీ మదర్స్‌డే మమ్మీ" అంది. ఆకాశంకేసి చూస్తూ చేతులు జోడించి. ఇదంతా గమనిస్తున్న వాణిజ్యవేత్త తడికళ్ళతో అక్కణ్ణించి నిశ్శబ్దంగా వెనుదిరిగాడు.

తర్వాత షాప్‌కు వెళ్ళిముందిచ్చిన ఆర్డర్ కాన్సిల్ చేసాడు. వందమైళ్ళ దూరంలో వున్న తల్లికి తానే స్వయంగా ఇవ్వడానికి పూలగుత్తి కొనుక్కుని తప్తహృదయంతో బయలుదేరాడు.

మనుషులు ఎంతదూరంలో ఉన్నారన్నది ముఖ్యం కాదు. వారిపట్ల మన బాధ్యత తీర్చుకోవటానికి ఏం చేసామన్నది ముఖ్యం కాదు. ఆ మనసుల్ని చేరుకోటానికి మనం ఏం చేయాలన్నది ముఖ్యం.

## *నిన్ను నీవు ప్రేమించు*

ఒక కుర్రవాడూ, అమ్మాయీ పార్క్‌లో కూర్చున్నారు. 'టైమయింది వెళ్తానంది' అమ్మాయి.

ఇంకొంచేసేపు వుండమన్నాడు అబ్బాయి. మాటల సందర్భంలో బాగా చదివి మంచి మార్కులతో పాసవమని సలహా ఇచ్చాడు. ముక్కు కాస్త ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే అచ్చు శ్రీదేవిలా వుంటావన్నాడు. ఇంతలో అమ్మాయి తుమ్మింది. 'ఆహా! ఎంత బావుంది' అన్నాడు. ఇద్దరూ ఇక వెళ్ళిపోవటానికి లేచారు. హఠాత్తుగా అక్కడ యముడు ప్రత్యక్షమై, ఇద్దరిలో ఒకర్ని తీసుకుపోక తప్పదనీ, ఎవర్నో నిర్ణయించుకొమ్మని ఆ కుర్రవాడిని అడిగాడు. కుర్రవాడు ఏం చెప్తాడు? నిశ్చయంగా శ్రీదేవినే కదా! ఎందుకు?

ఈ ప్రపంచంలో మనల్ని మనం ప్రేమించుకున్నంతగా ఎవర్నీ ప్రేమించం కాబట్టి. మరి మనతో మనం ఒంటరిగా ఎంతసేపు మనల్ని ప్రేమించుకుంటూ గడుపుతున్నాం? మనని ఎలా ప్రోత్సహించుకుంటున్నాం? ఎలా విమర్శించుకుంటున్నాం? మనం తుమ్మినప్పుడు కూడా మనకి మనం బావుండాలి (సెల్ఫ్ లవ్). మనని మనం అవసరం అయినప్పుడు ప్లాస్టిక్ సర్జరీ చేసుకోవాలి (సెల్ఫ్ క్రిటిసిజం). అప్పుడు, శ్రీదేవి (అనే విజయం) మన జీవితం పార్కులోంచి వెళ్ళిపోతాననదు.

## *ఏడాదికెన్నిరోజులు?*

తెలివి తేటలు, కామన్‌సెన్స్ లేని మనిషి ఏవిధంగా మాటల్లో మోసపోతాడో చూడండి.

ఒక గుమస్తా యజమాని వద్దకు వచ్చి ఒకరోజు క్యాజువల్‌లీవ్ ఇమ్మని అడిగాడు.

"ఒకరోజు శెలవు కావాలా?"

"అవును సార్"

"సంవత్సరానికి 365 రోజులు. రోజుకి నువ్వు ఏడుగంటలు పనిచేస్తావు. అంటే నా దగ్గర 106 రోజులు పనిచేస్తున్నావన్నమాట 365×7÷24 అంతేకదా! అందులో 52 ఆదివారాలు, పది జాతీయ శెలవు దినాలు పోతే ఇక మిగిలేదెంత?

"44 రోజులండి"

"రోజుకి గంట లంచ్ టైమ్, అరగంట టీ టైమూ లెక్కగడితే ఎన్ని రోజులవుతుంది?"

"43 రోజులండి"

"ఇంకెన్ని రోజులు మిగిలాయి?"

"ఒకరోజు"

"మరి ఆ ఒక్కరోజూ నువ్వు శెలవు తీసుకుంటే ఎలా?"

గుమస్తాకి ఏం మాట్లాడాలో తెలీదు. దీన్నే కామన్‌సెన్స్ లేక పోవటం అంటారు.

*గొప్పవారి ప్రేమ*

విశ్వజనీయమైన ప్రేమ అనేది హృదయంలో వుండాలి. అది చేతల రూపంలో బయటపడాలి కొందరికి అటువంటి ప్రేమ సహజంగానే వస్తుంది. సన్ షైన్ మెరైన్ అనే పత్రిక ఒక చిన్న సంఘటనని ఈ విధంగా వివరించింది. ఒకరోజు న్యూయార్క్‌లో దట్టంగా మంచుకురుస్తున్నదంట. పాదచారులు చెవులకు కోటు కాలర్లు అడ్డంగా పెట్టుకుని నడుస్తున్నారు. ప్రక్కవాడు కూడా కనపడనంత దట్టంగా మంచు కురుస్తున్నది.

అటువంటి వాతావరణంలో బూకర్ టి. వాషింగ్టన్ అనే ఒక నల్లజాతి వ్యక్తి రెండు చేతుల్లోనూ రెండు బరువైన పెట్టెలు పట్టుకుని స్టేషన్ వైపు నడుస్తున్నాడు. (నీగ్రోల స్వతంత్రం కోసం ఎంతో కృషిచేసి చరిత్ర కెక్కినవాడు ఈ బూకర్ వాషింగ్టన్.)

బురదగా వుఉన్న బాటపై అతడి కాళ్ళు జారిపోతున్నాయి. ఎంతో కష్టపడుతూ అతడు ఆ విధంగా, నడుస్తూ వుండగా ప్రక్కనుంచి "ఒక పెట్టె నాకు ఇవ్వు మిత్రమా" అన్న మాట వినపడింది.

నల్లజాతీయుడు నిర్ఘాంతపోయాడు. దశాబ్దాల క్రితం మాట ఇది. అప్పట్లో ఒక తెల్లవాడు నల్లవారితో అంత స్నేహంగా, ఆప్యాయంగా మాట్లాడటం కలలో కూడా వూహించలేని విషయం

బూకర్ కాస్త మొహమాటపడి "ఫర్వాలేదు" ఐ అంటూవుండగానే ఆ ప్రక్కనున్న తెల్లజాతి యువకుడు అతడి చేతినుండి ఒకపెట్టె తీసుకుని అతడితోపాటు నడవసాగాడు. ఇద్దరూ మాట్లాడుకుంటూ ఒకరి వివరాలు ఒకరు తెలుసుకుంటూ ప్రయాణం సాగించారు. స్టేషన్ వరకు ఆ విధంగా వెళ్ళి అక్కడ పెట్టె అందించి ఆ శ్వేతజాతి వ్యక్తి కరచాలనం చేసి వెళ్ళిపోయాడు. ఆ తరువాత వారిద్దరూ ఆ పరిచయాన్ని ఉత్తరాలద్వారా కొనసాగించారు. ఇద్దరివీ రెండు వేర్వేరు సిద్ధాంతాలు. ఒకరు అమెరికాలోని నల్లవారి హక్కులకోసం పోరాడిన బూకర్ వాషింగ్టన్. మరొక తెల్లజాతి యువకుడు రూజ్‌వెల్ట్. సిద్ధాంత రీత్యా శత్రువులు. అయినా ఇద్దరి స్నేహమూ కొనసాగింది.

ఆ తరువాత కొన్ని దశాబ్దాలకి బూకర్ వాషింగ్టన్ "అదే మొట్టమొదటిసారి నేను రూజ్ వెల్ట్‌ని కలుసుకోవటం" అని వెల్లడించాడు.

టాపాడో రూజ్ వెల్ట్ అప్పుడు అమెరికాకి ప్రెసిడెంట్.

*మానవత్వపు గుర్తు*

దట్టంగా మంచు కురుస్తున్న ఒక రాత్రి, అమెరికన్ ప్రెసిడెంట్ అవకముందు (అమెరికాలో పదవీ కాలం పూర్తిచేసాక కూడా అధ్యక్షుల్ని 'మాజీ' అనరు. వారిని కూడా ప్రెసిడెంట్‌లుగానే పిలుస్తారు) రీగన్ కార్లో వేగంగా వెళుతుండగా ఒక పెద్దరాయి వచ్చి వెనుక భాగాన పెద్ద చప్పుడుతో బలంగా తగిలింది. ఒక్కసారిగా కంగారుపడి అతడు రోడ్డుపక్కగా కారు ఆపుచేసి దిగాడు.

అక్కడో కుర్రవాడు చేతిలో మరో రాయితో సిద్ధంగా నిలబడి వున్నాడు. కట్టలు తెంచుకున్న కోపంతో రీగన్, అతడి చెంప బ్రద్దలు కొట్టాలన్న ఆవేశాన్ని బలవంతంగా అణచుకుని, 'పిచ్చెక్కిందా? ఎందుకిలా చేసావ'ని నిలదీసాడు.

అప్పుడా కుర్రవాడు, ప్రవాహంలా వెళ్తున్న కార్లని చూపిస్తూ "ఏం చెయ్యను రోడ్డుమీద కాలినడకన నడుస్తూన్న వారు ఎవరూ లేరు. గంటసేపటినుంచీ చేత్తో ఆపుతే ఎవరూ కారు ఆపటంలేదు" అన్నాడు.

"అందుకని రాయితో కొడతావా? ఇంతకీ ఎందుకు కొట్టావ్?" అతడిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలన్న ఆవేశాన్ని బలంగా అణుచుకుంటూ అడిగాడు రీగన్.

అప్పుడా కుర్రవాడు రోడ్డుకి ప్రక్కగా చక్రాల కుర్చీలోంచి గడ్డిలో పడిపోయిన వృద్ధుడ్ని చూపించాడు" నేనొక్కడినే ఎత్తి కూర్చోపెట్టలేకపోయాను. అరగంట నుంచీ ప్రయత్నిస్తూంటే ఎవరూ ఆగటంలేదు" అన్నాడు.

రోడ్డు ప్రక్కన వరుసగా చెట్లు వున్నాయి. ఆ చెట్లని ఆనుకుని ఎత్తయిన కాలిబాట వుంది. ఈవెనింగ్ వాక్‌కి జనం ఆ కాలిబాట మీద నడుస్తారు. చక్రాల కుర్చీ అక్కణ్ణుంచి క్రింద చెట్ల మధ్యకి జారిపోయిందన్నమాట. కుర్రవాడు ఒక్కడే ఆ వృద్ధుడి బరువు మోయలేక పోయాడనుకున్నాడు రీగన్. వృద్ధుడిని ఎత్తి కుర్చీలో సరిగ్గా కూర్చోపెట్టి ఆ కుర్రవాడితో "పెద్ద వాళ్ళని షికారు తీసుకొచ్చినప్పుడు జాగ్రత్తగా నడపాలి కుర్చీని" అన్నాడు.

ఆ కుర్రవాడు అయోమయంగా రీగన్ వైపు చుస్తూ, "ఆయన నాకేమీ కాడే" అన్నాడు అమాయకంగా.

రీగన్ అమెరికన్ ప్రెసిడెంట్ అయ్యాక కూడా ఆ కారుని తనతో పాటే వుంచుకున్నాడు. "దానిమీద రాయిదెబ్బ నాకు మానవత్వానికి గుర్తుగా కనపడుతుంది" అని ఆ తరువాత ఎన్నోసార్లు మీటింగుల్లో ఆయన చెప్పారు.

***"మీకు తెలుసా?***

జ్ఞానితో మాట్లాడటానికీ, అజ్ఞానితో మాట్లాడటానికీ తేడా ఏమిటి? జ్ఞానితో మాట్లాడితే ఉపయోగం అజ్ఞానితో సంభాషణ నిరర్ధక ఆనందం. తేడా ఈ క్రింది ఉదాహరణల్లో గమనించండి.

1. బ్యాంక్‌లో మనం వేసిన చెక్కు చెల్లకపోతే, వారు 50 నుంచి 100 రూపాయల దాకా మన దగ్గిర వసూలు చేస్తారు. కానీ దానికోసం వారికయ్యే ఖర్చు సగటున 2 రూపాయలు మాత్రమే.

2. భారతదేశంలో ఏడాదికి 25 వందల కోట్ల రూపాయలు తాగుడికి ఖర్చుపెడతారు. ఆ ఖర్చుతో నలభై లక్షలమంది అనాధల్ని జీవితాంతం ఆకలి నుంచి రక్షించవచ్చు.

3. మంచి రష్‌గా వుండే ట్రాఫిక్‌లో మనం వాహనాల్ని చాలా నెమ్మదిగా (ఒకటో గేర్‌లో రెండో గేర్‌లో) నడుపుతాం. మామూలుగా ప్రయాణం చేసే దానికన్నా ఒకటో గేర్‌లో ప్రయాణం చేస్తే ఆరురెట్లు ఎక్కువ పెట్రోలు ఖర్చు అవుతుంది. ప్రపంచంలోని వాహన చోదకులు అందరూ ట్రాఫిక్ రద్దీలేకుండా ప్రయాణం చేస్తే ఒక ఏడాదిలో ఆదా అయ్యే పెట్రోలుతో ప్రతిరోజూ రెండుసార్లు సూర్యుడి వద్దకు వెళ్ళిరావొచ్చు.

4. మనం ప్రస్తుతం ఎన్నో ట్రాఫిక్ రూల్స్ మధ్య వాహనాల్ని నడుపుతున్నాం. ఎడమవైపు వాహనం నడపాలి. కుడివైపునుంచి మాత్రమే ఓవర్ టేక్ చెయ్యాలి. మలుపు తిప్పేటప్పుడు ఇండికేటర్ లైటు వెయ్యాలి. ఈ రూల్స్ అన్నీ కనిపెట్టిన విలియమ్ ఫెల్ప్స్‌ని ఫాదర్ ఆఫ్ ది ట్రాఫిక్ సేఫ్టీ అంటారు. అయితే అతడు తన జీవితకాలంలో కారు నడపలేదు. తన డ్రైవరూ మిగతాచోదకులూ చేస్తున్న తప్పుల్ని గమనించి ఈ విధంగా రూల్సు రూపొందించాడు.

5. కోటి రూపాయలు, ఒక రూపాయి నోటుమీద మరొక రూపాయి నోటు పెట్టుకుంటూ పోతే, అది ఏడుమైళ్ళ ఎత్తుంటుంది.

6. ఈజిప్టులోని పిరమిడ్స్ క్రింద వైశాల్యం (base). పది ఫుట్‌బాల్ గ్రౌండ్లు కలిపితే ఉన్నంత ఉంటుంది.

7. సినిమాల్లో ఎర్రడ్రస్ వేసుకున్న హీరోయిన్ వెనుక ఎద్దుపడితే హీరో ఆమెని రక్షిస్తాడు. అదే విధంగా బుల్‌ఫైట్‌లో ఎద్దుముందు ఎర్రగుడ్డ పెట్టి, దానికి ఆవేశం తెప్పిస్తారు. కానీ నిజానికి ఎద్దులకి రంగుల విచక్షణలేదు. అవి కలర్ బ్లైండ్ ఏ రంగు గుడ్డ పెట్టినా అవి ఆవేశంతో ఆ విధంగానే ముందుకి దూసుకు వస్తాయి. కళ్ళముందు గుడ్డపెట్టి ఆడించటమే వాటి ఆవేశానికి కారణం. అంతే తప్ప ఎర్రరంగుకాదు.

8. చేతివేళ్ళు అతుక్కుని వుంటే మనిషి ఇప్పటికీ మృగంలాగే వుండేవాడు.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments